# ఆధునిక నీతి కథలు



తాళ్లూరు నాగేశ్వరరావు

సూరయ్య తండ్రి నారయ్య ఆ వూళ్లోకి పద్దెనిమిదేళ్ల వయస్సులో వచ్చాడు. కాటాకూలీగా స్థిరపడిపోయాడు. నాలుగురాళ్లు వెనకవేసుకున్నాక ఒక బీదమ్మాయిని పెళ్లిచేసుకున్నాడు. నారయ్య చనిపోయేనాటికి సూరయ్య ఓ మాదిరి స్థితిమంతుడయ్యాడు. వారసత్వంగా కాటాకూలీ కాలేదుగానీ కాటా ముఠాకు మేస్త్రీ అయ్యాడు. ఓ ఎకరం కట్నంతో పెళ్లిచేసుకున్నాడు. మూడేళ్ల తర్వాత ధాన్యం కమీషన్ ఏజంటయ్యాడు. ఊళ్లో రైతుల దగ్గర ధాన్యం కొనుగోలుచేసి, ఫ్యాక్టరీకి తోలిస్తాడు. బస్తాకు రూపాయి, అర్ధా కమీషన్ మినహాయించుకొని, ఫ్యాక్టరీవాళ్ల దగ్గర తీసుకొన్న డబ్బును రైతులకిచ్చేవాడు. ఆ కమీషన్ వ్యాపారంలో సూరయ్య ఏడాదికి పాతికవేల చొప్పున సంపాదించసాగాడు. రెండుమూడేళ్లల్లో పదెకరాల మాగాణి భూమి కొన్నాడు. అతనికి ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్లా సంతానం.

సూరయ్య అరచేతిలోని అదృష్టరేఖకు అడ్డుగీతలేమీ లేవు. నడివయస్సులో ఏడేళ్లపాటు ధనయోగం బ్రహ్మాండంగా ఉండడంతో పట్టిందల్లా బంగారమై లక్షలకు లక్షలు ఆర్జించాడు. ఊళ్లో ఒక మోడరన్ రైసుమిల్లు కట్టాడు. పంచాయతీ బోర్డుకు ప్రెసిడెంటయ్యాడు. రెండున్నర లక్షలు పెట్టి ఆధునిక పద్ధతుల్లో వూరంతటికీ శిరోమణిలా ఉండేట్టు అందమైన భవనాన్ని నిర్మించాడు. ఆ వూళ్లో చూడదగ్గ దృశ్యం సూరయ్య ఇల్లే అన్న పేరు పడింది. ఐశ్వర్యాన్నయితే సూరయ్య ఆకట్టుకోగలిగాడు గానీ, పిల్లలకు చదువుసంధ్యలు వంటబట్టలేదు. ఐశ్వర్యలక్ష్మి అనుగ్రహించింది గానీ చదువుల సరస్వతి ఆ ముంగిట కాలు పెట్టలేదు.

అయినప్పటికీ సూరయ్య అట్టే విచారించలేదు. తాను సంపాదించిన ఆస్తి ఏడుతరాలవాళ్లు తిన్నా తరగదనుకున్నాడు.

సూరయ్య వడ్డీవ్యాపారంలో కూడా సిద్ధహస్తుడని అనిపించుకున్నాడు. బస్తీల నుంచి పెద్దపెద్ద వ్యాపారస్తులు వచ్చి స్థిర చరాస్తులు తాకట్టుపెట్టి వేలకు

వేలు డబ్బు అప్పుగా పట్టుకెళ్లేవారు. వూళ్లో "షావుకారు సూరయ్యా" అన్న కీర్తిప్రతిష్ఠల్ని సంపాయించాడు. కాని సూరయ్య మనస్సుకు సంతృప్తి చిక్కలేదు. ఆశ అనేది ఆకాశమంత అయినప్పుడు దానికి నిచ్చెనవేసి, మెట్లెక్కడం సాధ్యమవుతుందా ?

తన కొడుకులు తన ఆస్తికి వారసులేగానీ ఆ స్తిని అంతకు రెండింతలు చేసే ప్రయోజకులు కారని సూరయ్యకు తెలుసు. అందుచేత తాను ఎన్ని లక్షలు ఆస్తి సంపాదించినా కొడుకులకు అర్ధరూపాయి అందుబాటులో వుంచేవాడు కాదు. నెలకోసారి సినిమాకు వెళ్లాల్సివచ్చినా అయ్యని అడిగి టిక్కెట్టు డబ్బులు పుచ్చుకోవాల్సిందే. తండ్రి తమపట్ల బహు పీనాసిగా వుంటున్నాడనీ, తమ సర్దాలు తీరడానికి పైసా ఇవ్వడంలేదనీ కొడుకులు ఆగ్రహావేశాపరులు అవుతున్నారు గానీ తండ్రిఎదుట నాలుక కురచన అవుతూన్నది. కిక్కురుమనడం లేదు.

సూరయ్య తన కొడుకులకు పెళ్లిళ్లు చేశాడు, భారీ ఎత్తున కట్నాలు పుచ్చుకొని. కూతురుక్కూడా మంచి కట్నం ఇచ్చి పెళ్లిచేశాడు.

ఏభైయేళ్ల వయస్సులో ఒకనాడు మధ్యాహ్నం సూరయ్య మేడమెట్లు దిగుతూదిగుతూ హఠాత్తుగా కింపడిపోయాడు. డాక్టరు వచ్చేలోపుగానే పక్షవాతంతో ఒక చేయీ, కాలూ పూర్తిగా చచ్చుపడిపోయాయి. లేవలేని స్థితి ఏర్పడింది.

తండ్రి అవిటివాడు కావడంతో కొడుకులు సంతోషించారు. బంధవిముక్తి అయిందనుకొన్నారు. ఆస్తినీ, అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఆస్తీ, డబ్బూ పంచుకున్నారు.

సూరయ్య బ్రతుకు నాలుగుగోడల మధ్య పరిమితమైపోయింది. ఎన్ని మందులు తిన్నా చచ్చుపడిన కాలూ, చేయీ రాలేదు. పైపెచ్చు హృద్రోగం వచ్చి ఓ తెల్లవారుఝామున ఇహలోకయాత్ర సాగించాడు.

తండ్రి అంత్యక్రియలను కొడుకులు అత్యంత సామాన్యంగా ముగించారు– ఖర్చులు ఎవరు భరించాలో తెలీక, చివరకు తల్లీ, కొడుకులూ మూడు వంతులుగా వేసుకున్నారు.

సూరయ్య అంత అనామకంగా చనిపోయినందుకూ, ఊళ్లో పదిమంది కూడా చేతులు కడిగించనందుకూ ఊళ్లోవాళ్లు ఆశ్చర్యపోయారు.

తండ్రి నానాగడ్డీ తిని సంపాయించిన ఆస్తినీ, డబ్బునూ కొడుకులు ఉప్పునీళ్ల ప్రాయంగా ఖర్చుచేయసాగారు.

*చనిపోయినా చనిపోయినట్టు సాటివాళ్లు గుర్తించలేకపోవడం కన్నా ఘోరమైన అవమానం మనిషిజన్మకు మరొకటి లేదు.*